## బాధిత కుటుంబానికి వంటేరు పరామర్శ



మనోహరాబాద్, ఆగస్టు 12: మేడ్చల్ మండలం గౌడవెల్లిలో ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు చెందిన రైల్వే ఉద్యోగి తొగరి కృష్ణయ్య, అతని కూతుళ్లు తొగరి వర్షిని, వరని మృతిచెందారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పురం నవనీతారవి ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్ ఉన్నారు.

## పరిస్థితి విషమించి మహిళ మృతి

శివ్వంపేట, ఆగస్టు 12: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మహిళ మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నవాబ్‌పేట గ్రామానికి చెందిన రాంపల్లి లత (33), భర్త రాజిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి 15 ఏండ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 9న లతపై భర్త దాడి చేయడంతో గాయాలపాలైంది. దీంతో ఆమెను తూప్రాన్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మల్లారెడ్డి దవాఖానకు తరలించారు. ఈ నెల 11న చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. తన కూతురు మరణంపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి తండ్రి గోవిందాపురం సుభాన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

## కాండం తొలిచే పురుగును గమనించాలి



చండూర్‌లో వరిని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత సరిత

చిలిపిచెడ్, ఆగస్టు 12: వరిలో కాండం తొలిచే పురుగును గమనించాలని ఏరువాక శాస్త్రవేత సరిత రైతులకు సూచించారు. సోమవారం చండూర్ గ్రామంలో రైతు చంద్రశేఖర్‌రెడ్డి వేసిన సన్నరకం వరి పొలాన్ని ఆమె పరిశీలించారు. కాండ తొలిచే పురుగు నివారణకు ఎకరాకు 10 కిలోల 3జీ వేయాలన్నారు. రైతు చంద్రశేఖర్‌రెడ్డి తన పొలంలో కూనారం 12368 అనే సన్నరకం వేశాడు. ఈ రకం 125–135 రోజుల వ్యవధిలో ఎకరా 26నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


చిలిపిచెడ్, ఆగస్టు 12: మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని హెచ్‌ఎం తారాసింగ్ అన్నారు. ఫైజాబాద్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొని విజయం సాధించారు. ఈ పోటీలను మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించారు. పోటీల్లో హరీశ్, అక్షిత, శివకేశవ్ పాల్గొని కటాస్ విభాగంలో బంగారు, స్పారింగ్‌లో వెండి పతకాలు సాధించారు. విద్యార్థులను టీచర్లు అభినందించారు.

## మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ



మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 12: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండ వీణ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. ర్యాలీలో సంగీత, మల్లిక, రాజ్యలక్ష్మి, ప్రవళిక, మంజుల ఉన్నారు.


## జిల్లా ఉద్యమ అధ్యక్షుడిగా సత్యనారాయణ



నూతన అధ్యక్షుడు సత్యనారాయణను సన్మానిస్తున్న కళాకారులు

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ అర్బన్,, ఆగస్టు 12: జిల్లా నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా గుడాల సత్యనారాయణ, వల్లపు స్వామి ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పుల్లెల రమేశ్, సహాయ కార్యదర్శిగా శేఖర్‌చారి, సోషల్ మీడియా ప్రచార కార్యదర్శిగా భిక్షపతి, మహిళా అధ్యక్షురాలిగా బద్దం సుమలత ఎన్నికయ్యారు.

## సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దు



రామాయంపేట, ఆగస్టు 12: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ లింబాద్రి, సుప్రియ తెలిపారు. సోమవారం దవాఖానలో రోగులు బారులు తీరారు. జ్వరాలు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు వస్తున్నాయని, నివారణకు పరిసరాలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెంది మలేరియా, డయేరియా వ్యాపిస్తాయన్నారు. రోజూ దవాఖానకు 250 మంది వరకు రోగులు వస్తున్నారన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ రాహుల్ రాజ్
- ప్రజావాణిలో 212 దరఖాస్తులు
- సమస్యలు త్వరగా పరిష్కరించాలి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ అర్బన్: అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ప్రజావాణిలో 212 దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం కార్యక్రమానికి వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు 10, ధరణి సమస్యలు 63, పింఛన్లు 35, రుణమాఫీ 16, ఉపాధి కోసం 5 ఇతర సమస్యలు 83 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో..**

మెదక్ అర్బన్, ఆగస్టు12: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలు పరిరక్షిస్తూ, ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తున్నదన్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి




రామాయంపేట మండల వనరుల కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన



శివ్వంపేట: మృతిచెందిన ఉద్యోగుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

### - మృతిచెందిన ఉద్యోగులకు నివాళి

రామాయంపేట/శివ్వంపేట, ఆగస్టు 12: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సోమవారం రామాయంపేట, శివ్వంపేట మండలాల్లోని మండల వనరుల కేంద్రంలో ఆందోళన చేశారు. ఉద్యోగ భద్రత లేక, తక్కువ వేతనాలతో పాటు పని తీవ్రత పెరిగి కుటుంబ పోషణ భారాన్ని మోయలేక ఇటీవల మృతిచెందిన సమగ్ర శిక్షా ఉద్యోగుల చిత్రపటాలకు నర్సాపూర్‌లో సమగ్రశిక్షా ఉద్యోగులు ఘన నివాళి అర్పించారు. నెల రోజుల్లో ఖమ్మం, రంగారెడ్డి, నారాయణపేట్, ఆదిలాబాద్ జిల్లాల్లో నిరాశకు గురై గుండెపోటుతో మృతి చెందారని ఆవేదన చెందారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేయాలన్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రభుత్వం తమ షరతులను అంగీకరించకుంటే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజు, కనకరాజు, సంతోష్, శ్రీకాంత్, రజిత, వినోద, తులసమ్మ ఉన్నారు.

## పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు 12: పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక భరోసా ఇస్తున్నదని పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మానేపల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో వైద్యం చేయించుకున్నారు. వైద్య ఖర్చులకు రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ మంజూరైంది. సోమవారం నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో రాజిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పలువురు ఉన్నారు.

## మట్టిదిబ్బ కూలి కార్మికులకు గాయాలు



పైప్‌లైన్ పనుల్లో గాయపడ్డ కార్మికుడు

రామాయంపేట, ఆగస్టు 12: మట్టి దిబ్బలు కూలి ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలైన ఘటన రామాయంపేటలోని మల్లె చెరువు ప్రాంతంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మల్లె చెరువుల ప్రాంతంలో కొన్ని రోజులుగా జేసీబీలతో నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ కోసం గుంతలు తీస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒక్కసారిగా పెద్దశబ్ధంతో మట్టిదిబ్బలు కూలి కార్మికులపై పడ్డాయి. దీంతో ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. కార్మికుడు జ్యోతిశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## కెమికల్ పరిశ్రమ వద్ద ధర్నా



ఉసిరికపల్లి ఫార్మాబయో పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట, ఆగస్టు 12: మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో ఫార్మాబయో ప్రైవేట్ లిమిటెడ్ కెమికల్ పరిశ్రమ నిర్మిస్తున్నారు. దీంతో పొలాలు దెబ్బతింటాయని గ్రామస్తులు పరిశ్రమ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ పరిశ్రమ విడుదల చేసే కాలుష్యంతో పర్యావరణంతో పాటు పంటలు దెబ్బతిని ప్రజలు, పశువులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారావు, వీరేశం, శ్రీనివాస్‌గౌడ్, అశోక్ సాదుల, రైతులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఎం సృజన

కొల్చారం, ఆగస్టు 12: కొల్చారం పీహెచ్‌సీలో నర్సాపూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన సోమవారం తనిఖీ చేశారు. స్టోర్ గది, ల్యాబ్, డెలివరీ గది, వార్డులను పరిశీలించారు. రికార్డులు, రిపోర్టులు పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధులకు గురైతే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్, ఎంపీహెచ్‌ఈవో మదన్‌మోహన్, పీహెచ్‌ఎన్ ఏసుమని, మార్తా, సూపర్‌వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు ఘనంగా వీడ్కోలు



కౌడిపల్లి, ఆగస్టు12: కౌడిపల్లి నుంచి ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో కరీముద్దీన్, ఏపీవో పుణ్యాదాస్ ఉన్నారు.

## ఈ రోడ్డుపై ఎలా వెళ్లాలి సార్?



శివ్వంపేట, ఆగస్టు 12: 'బురద రోడ్డు గుండా నడుస్తూ మేము స్కూల్‌కు ఎలా వెళ్లాలి సార్.. తమను పట్టించుకోండి' అంటూ నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ పంచాయతీలోని జీవీ పోచమ్మతండాకు చెందిన గిరిజన విద్యార్థులు తమ గోడును వెళ్లబుచ్చుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయం అవుతున్నదని, తండా నుంచి పాఠశాలకు వెళ్లడానికి బురద రోడ్డులో పడరాని పాట్లు పడుతున్నామని చెబుతున్నారు. తండా నుంచి పాఠశాలకు దాదాపు 2 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. తమ తండా రోడ్డు బాగు చేయించాలని చిన్నారులు అధికారులను వేడుకుంటున్నారు.

## వృద్ధురాలిపై ఊరకుక్కల దాడి



కోనాపూర్‌లో రోడ్డుపై ఊర కుక్కలు, (ఇన్‌సెట్‌లో) దాడిలో గాయపడ్డ కడారి బీరవ్వ

రామాయంపేట, ఆగస్టు 12: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు కడారి బీరవ్వపై ఊరకుక్కలు దాడి చేసిన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డుపై కాలినడకన వెళ్తున్న బీరవ్వపై గుంపుగా ఉన్న ఊరకుక్కలు దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే బీరవ్వను రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతున్నది. ఊరకుక్కలు గుంపుగా తిరుగుతూ దాడులకు దిగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

## మహిళల భద్రతకే షీ టీమ్స్



షీ టీమ్స్ పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మెదక్ అర్బన్, ఆగస్టు 12: మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ పనిచేస్తున్నాయని షీ టీమ్స్ ఇన్‌చార్జి ఏఎస్సై రుక్సానా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బీడి కార్మికులు, బాలురకు షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేకంగా మహిళల భద్రతకు ప్రతి సబ్ డివిజన్‌లో షీ టీమ్స్‌ను ఏర్పాటుచేసిందన్నారు. ఆపద సమయంలో డయల్ 100, షీ టీమ్ జిల్లా నెంబర్‌కు 8712657963కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ కానిస్టేబుల్స్ విజయ్, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణమాఫీ అయ్యేలా చూడాలని వినతి

శివ్వంపేట, ఆగస్టు 12: అర్హులైన రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రైతురక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్ వినతిపత్రం అందజేశారు.

## అన్నీ తామై అనాథకు సపర్యలు



అనాథను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయిస్తున్న 108 సిబ్బంది

రామాయంపేట, ఆగస్టు 12: వృద్ధుడికి నా అనేవారు ఎవరూ లేకపోవడంతో దవాఖాన వైద్యులు, 108 సిబ్బంది అన్నీ తామై సపర్యలు చేస్తున్నారు. రామాయంపేటలోని హరిజన కాలనీకి చెందిన ఒడ్డె ప్రభాకర్‌కు ఎవరూ లేకపోవడంతో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. చేతకాని వయస్సులో కాల్వలో పడి ఉన్న అతడిని గమనించిన కొందరు అక్కున చేర్చుకుని సపర్యలు చేసిన కథనం నమస్తే తెలంగాణలో ప్రచురితమైంది. దీంతో ప్రభుత్వ దవాఖాన వైద్యులు, పోలీసులు స్పందించి 108 అంబులెన్సులో అతడికి చికిత్సలు అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలి: తపస్

చేగుంట, ఆగస్టు 12: కేజీబీవీలో పనిచేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వడియారం, పోలంపల్లి, ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో సభ్యత్వం నమోదు చేశారు. విద్యార్హతలు కలిగి, అర్హత పరీక్షలో మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఎంపికై, కొన్నేండ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, పీజీసీఆర్‌టీలు, బోధనేతర సిబ్బంది ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, మండల శాఖ అధ్యక్షుడు రావుల వెంకటేశ్, అమరేశ్వరి, బక్కప్ప, శ్రీనివాస్, పద్మ, సునీత, హెలెన్ సునీత, సిద్ధిరాములు, వసంత న్నారు.

## డైట్‌లో ఉర్దూ అధ్యాపకులను నియమించాలి



మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 12: డైట్ కళాశాలలో ఉర్దూ మీడియంలో బోధించడానికి అధ్యాపకులను నియమించాలని కోరుతూ డీఈవో రాధాకిషన్‌కు ఉర్దూ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉర్దూ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ రియాజుద్దీన్, నాయకులు ఇంతియాజుద్దీన్, సయ్యద్ సబ్దర్, యూసూఫ్‌అలీ ఉన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నిజాంపేట, ఆగస్టు 12: చల్మెడ గ్రామానికి చెందిన చెత్రి శ్రీశైలం(40) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతుడి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి ద్వారా అందజేశారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి



జిందేశ్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 12: కరెంట్‌షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. కొట్టాల గ్రామానికి చెందిన గరబోయి న జిందేశ్ ఉదయం లేచి రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో సర్వీస్ వైర్ తెగిపడి ఉన్న వైర్ తొక్కడంతో విద్యుత్ షాక్‌కు గురై స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తోటి రైతులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని, జిందేశ్‌ను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజం

చిన్నశంకరంపేట/చేగుంట/నిజాంపేట, ఆగస్టు 12: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమని పలువురు తెలిపారు. చిన్నశంకరంపేట మండలం చెన్నాయపల్లి పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి బదిలీ అయ్యారు. చేగుంట మండలం మాసాయిపేటకు చెందిన మేడిపల్లి చక్రధర్‌శర్మ బదిలిపై వెళ్లాడు. నిజాంపేట మండలంలోని తిప్పనగుల్ల పాఠశాలలో కిరణ్‌కుమార్, పరశురాముడు, రాజశేఖర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను తోటి టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వారు పాఠశాలలకు అందించిన సేవలను కొనియాడారు.


**PUBLIC NOTICE**

The Public in general are hereby informed that my client/s are intending to purchase Agricultural Land total admeasuring 06 Acres 06 acres 14 ½ guntas, in part of Sy.Nos.338,339, 340 &341, situated at Muppireddypally Village, Manoharabad Mandal, Medak District, from the following persons;

| NAME | Sy.Nos. | Acres - Guntas |
| --- | --- | --- |
| 1. Smt.Basuwada Venkatamma | 338/A/1/1/1<br>340 A | 02 - 17 ½<br>00 - 17 |
| 2. Smt.Vennavaram Sri Rekha | 338/A/2 | 00 - 20 |
| 3. Smt.Narra Ghoutami | 338/A/1/2 | 00 - 20 |
| 4. Sri.Basuwada Sathi Reddy | 339/E | 00 - 20 |
| 5. Sri.Aziz Khan | 341/A | 02 - 00 |

and also paid substantial amount as advance and earnest money. My client is now contemplating to complete the said Sale transaction. If anybody got any right or objection of whatsoever, may contact the under signed in writing within one week from the date of this publication, failing which my client shall treat that there are no objections and proceed with the Sale Transaction.

**M/s M.Goverdhan Reddy, G.Chandrashekar Reddy, R.Sai Raj Reddy, S.Chandrakanth,** Advocates
Plot No.6, Sri Malani Colony, Tarbund, Secunderabad-9 Mobile: 9866118803